'మీరు నల్లగా వున్నారని అనను. వెధవలు ఆ మాటనేది; కానీండి, మిమ్మల్ని చూస్తే ఎందుకో గొడుగు గుర్తొస్తూంటుందండి'

'మీరు మా ఇంటికి రావడం ఎంతో సంతోషంగా వుంది. ఇంకో సారి రాబోయే ముందు దయచేసి ఫోన్ చేయరూ?'

'ఓహో.... ఇడ్డెను అన్న పదంలో బూతుందని ఆంధ్రభూమి డెయిలీలో 'జనవాణి'కి రాసింది మీరేనన్నమాట. మరి మీకు 'గారె' ఎలా వుంటుందో తెలీదా?'

మిగతావి మీ ఓపిక.

# భారత దేశ జనాభా ఎంత?

ఎన్నికల సందర్భంగా, కృష్టశబ్దం శీర్షిక ఆంధ్రభూమి డెయిలీలో కొంతకాలం మాయం అయినపుడు (ఎన్నికల వార్తలు భూమి డెయిలీలోని అనేక రెగ్యులర్ శీర్షికలని మింగేసాయి) మనదేశంలో తాజా జనాభాలెక్కల సేకరణ జరిగింది.

ఆ సందర్భంలో నేనో ఘోరమైన పొరపాటు చేశాను. దాన్ని సరిదిద్దుకున్నాను. ఆ తాజా జనాభాలెక్కల ప్రకారం భారత జనాభా మొత్తం 84 కోట్ల 39 లక్షల 30 వేల 861 మందిగా పేపర్లో ప్రకటించారు నిజానికి ఆ జనాభా సంఖ్యలో 'ఒకటి' నా పొరబాటువల్ల పెరిగివుండేది. అంటే నిజానికి జనసంఖ్య 84,39,30,361 అయినా 84,39,30,862 మంది అయివుండేది. అలాగే వారిలో స్త్రీల సంఖ్య 40,63,32.932గా ప్రభుత్వం ప్రకటించింది. ఈ సంఖ్య 40,63,32,933 అయి వుండేది, నేను ఆ పొరబాటుని సమయానికి సరిదిద్ది వుండకపోతే. అంటే ఓ స్త్రీని ఎక్కువగా ప్రభుత్వం పొరబాటును లెక్కించి వుండేది.

ఇదెలా జరిగిందంటే....

ఓరోజు నేను యింట్లో లేనపుడు జనాభాలెక్కల కార్యాలయంనించి ఒకమ్మాయి వచ్చింది. మా యింటి జనాభాలో మా అమ్మ కూడా ఉన్నట్లుగా యింట్లోవాళ్ళు చెప్తే ఆమె రాసుకెళ్ళింది అన్న సంగతి నేను పూర్ణించి వచ్చాక తెలిసింది.

మా అమ్మ మాతో యిక్కడుండదు. విజయవాడలో కూడా ఉంటూంటుంది. కాబట్టి వెంటనే మా అమ్మకి ఫోన్‌చేసి చెప్పాను.

"అమ్మా, జనాభాలెక్కల వాళ్ళొస్తే నీవు లేవని వాళ్ళతో చెప్పాలి."

"నేను లేనని చెప్తే నువ్వున్నావుగా అంటార్రా నాయనా ఆ వచ్చినవాళ్ళు" జవాబు చెప్పింది మా అమ్మ.

"అయినాసరే నువ్వు లేవని చెప్పాలి."

"ఎందుకని? నేను ఇన్కంటేక్స్ ఏటా కడుతునే ఉన్నాగా?" అడిగింది మా అమ్మ.

"అబ్బే. అందుకుకాదు. నువ్వు ఇక్కడ మాతో హైద్రాబాద్‌లో వున్నావని జనాభాలెక్కల వాళ్ళకి చెప్పాం. ఆ లెక్క తప్పకూడదని"

"నిన్ననే వాళ్ళొచ్చి వెళ్ళారు. నేనిక్కడే ఉన్నానని రాసుకెళ్ళారు" చెప్పింది మా అమ్మ.

"అరెరే! ఎంత ఘోరం జరిగిపోయింది. ఇప్పుడెలా?" అడిగాన్నేను.

"ఏముంది! మీ వూళ్ళోని జనాభాలెక్కల కార్యాలయానికి వెళ్ళి జరిగిన పొరబాటు చెప్పి సరిచేయించు" సలహా యిచ్చింది మా అమ్మ.

అదే సరయినదని అనిపించడంతో ఫోన్ పెట్టేసి ఆ కార్యాలయం ఎక్కడుందో వాకబుచేసి, సరాసరి వాళ్ళాఫీసుకి వెళ్ళాను. ఆఫీసర్‌ని కలిసి చెప్పాను జరిగింది.

"ఏ వార్డు! ఏ నంబరు యిల్లు!" అడిగాడు. చెప్పాను.

ఆయన రికార్డులన్ని తిరగేసి, నా వంక ఓ దేశద్రోహి వంక చూస్తున్నట్లుగా చూసి చెప్పాడు.

"ఇంతాలస్యంగానా వచ్చేది. మీ ఇంటినించి జనాభాలెక్కల సేకరణ జరిగి రెండువారాలయింది. ఇంతకాలం ఏంచేస్తున్నారు?" అడిగాడు.

"మద్రాస్‌లో ఓసినిమా కథకి సంభాషణలు రాస్తున్నాను" చెప్పాను.

"సినిమా కథలు చెప్పమాకండి. అసలే భారతదేశ జనాభా పెరిగి ప్రపంచంలోని రెండవ పెద్ద దేశంగా మారింది. దేనిలో! జనసంఖ్యలో. అలాంటిది మీరు ఇంకోసంఖ్య పెంచేసారు"

"సంగతి తెలిసిందిగా? మా అమ్మ పేరు కొట్టేసి ఒకటి తగ్గించండి" చెప్పాను.

"మీ వార్డు జాబితా ఫైనలైజ్ అయి మా సెంట్రల్ ఆఫీసుకి నిన్నే వెళ్ళిపోయింది" చెప్పాడు.

"వాళ్ళాఫీసు ఎక్కడ?" అడిగాను.

"ఢిల్లీలో"

"సంగతి వివరిస్తూ వాళ్ళకి లెటర్ రాయండి"

"వాళ్ళేం పట్టించుకోరు. మనదేశంలో ఎన్నిలక్షల వార్డులున్నాయో తెలుసా? మీవార్డు ఫైల్ వెతికి పట్టుకోవాలంటే వాళ్ళుచేసే పని ఆపాల్సి వుంటుంది. అలా చేయరు వారు"

"మరెలా?" అడిగాను.

కొద్దిక్షణాలు ఆలోచించి చెప్పాడు.

"ఆఖరివార్డు జాబితా ఫైనలైజ్ చేస్తున్నాం. ఓ స్త్రీ సంఖ్య తగ్గించి పంపితే నంబర్ టేలీ అవుతుంది"

"ఎక్సలెంట్ ఐడియా. అలా చేయండయితే" చెప్పాను.

"కాకపోతే దాన్లో ఓ చిక్కుంది. అయినా ఈ వివరాలు చెప్పండి" అని ఓ ఫారం యిచ్చాడు.

"దాన్లో మా అమ్మ వయసు, కులం, చదువు, వుద్యోగంలో వుందా లేదా, పెళ్ళయిందా లేదా (ఆ ఫారం ముందే అచ్చయిందని గమనించాలి) పిల్లలెంతమంది, భర్త బతికి వున్నాడా లేదా సంవత్సరపు

ఆదాయం ఎంత లాంటి ప్రశ్నలున్నాయి. వాటిని ఓపిగ్గా నింపాను.

ఆయన ఫైనలైజ్ చేస్తున్న వార్డులోని ఆడవాళ్ళ పేర్లు ఎదురుగా, ఈ సమాచారంతో సరిపోయే పేర్లకోసం వెదికాడు. వెదుకుతూ చెప్పసాగాడు.

"డబ్బై తొమ్మిదేళ్ళవయసు గల స్త్రీ .. దొరికింది.... బ్రాహ్మల్లో కావాలి.... ఆ ... దొరికింది.... నిరుద్యోగి అయి వుండాలి.... ఆ దొరికింది.... పెళ్ళి అయిన మహిళ కదా దొరకాలి.... ఆ దొరికింది.... భర్త బతికి వుండకూడదు.... ఆ దొరికింది.... పిల్లలెంతమందన్నారు? మీ అమ్మకి తొమ్మిదిమంది సంతానమా? అరెరె.... ఈవిడకి పదకొండుమంది సంతానం...." మరికొన్ని కాగితాలు తిరగేసి పెదవి విరిచి చెప్పాడు.

"ఊహూ. మీ అమ్మగారికున్న క్వాలిఫికేషన్స్‌కి సరిపడేలాంటి క్వాలిఫికేషన్స్ గల బ్రాహ్మలెవరూ లేరు."

"పోనీ ఇంకో కులం వాళ్ళ పేరు కొట్టేయండి" చెప్పాను.

వెంటనే ముక్కు మీద వేలేసుకొని 'తప్పు' అన్నట్లుగా చూసి చెప్పాడు నాతో.

"కేవలం జనాభాలెక్కలే కాదు. వాళ్ళ బ్రేకప్ కూడా సరిపోవాలి. ఇంకోకులం వాళ్ళపేరు కొట్టేస్తే ఆ కులం మహిళల సంఖ్య తగ్గి, మీ కులం మహిళ సంఖ్య పెరుగుతుంది. అన్నీ కరెక్ట్‌గా సరిపోతేనే ఓ పేరు తీసేద్దామనుకున్నాను."

"మరెలా?" అడిగాను.

ఇంకొంచెం సేపు ఆలోచించి చెప్పాడు.

"మా విజయవాడ బ్రాంచికి రాస్తాను మీ అమ్మగారి పేరు కొట్టేయమని. వాళ్ళింకా ఫైనలైజ్ చేసి వుండరు."

"అలా చేయండి" చెప్పాను రిలీఫ్‌గా ఫీలయి. ఆ తర్వాత మా ఇంటిఫోన్ నంబరు ఇచ్చి బయటికి వచ్చాను. రెండురోజుల తర్వాత నాకు ఆ ఆఫీసర్ నించి ఫోన్ వచ్చింది.

"గట్టెక్కాం. మీ అమ్మగారికి క్వాలిఫికేషన్స్‌కి సరిపడే ఓ 'కామేశ్వరమ్మ' అనే ఆవిడ పేరు మలక్‌పేట వార్డులో దొరికింది. అది కొట్టేసాను."

"అంటే భారత జనాభాలో పెరిగిన ఓ మహిళ సంఖ్య తగ్గినట్టేనా?" అడిగాను ఆనందంగా.

"ఆహా. ఆ పేరు వెతకడానికి రోజుకి నలుగురం ఒకొక్కరం ఎనిమిదిగంటలు పనిచేసాం. ఇంకెప్పుడూ యిలాంటి పొరపాటు చేయకండి" కోప్పడ్డాడాయన.

"అలాగేసార్. ఐయామ్ సారీ. మొత్తానికి భారతదేశం పరువు కాపాడారు, ఓ జనసంఖ్య తగ్గించి" చెప్పాను.

ఆ రాత్రి హాయిగా నిద్రపోయాను. మార్చి యిరవై ఆరు, 1991 దినపత్రికలో భారత జనాభా సంఖ్య వివరాలు మొదటిపేజీలో వచ్చాయి. అది కరెక్ట్‌గా వచ్చినందుకు బాధ్యత వహించి నేను చేసిన కృషికి ఎంతో మానసికంగా తృప్తిపొందాను. ప్రతి వెయ్యిమంది పురుషులకీ మనదేశంలో 929 మంది మహిళలున్నారని చదివాను. నేనా పొరబాటుని సరిదిద్దకపోతే బహుశా ఆ సంఖ్య 930కి పెరిగి వుండేది. అలాగే చదరపు కిలోమీటరుకు జనసాంద్రత 267 బదులు 268గా మారివుండేది. భారత పౌరుడిగా పుట్టడమేకాదు భారత పౌరుడిగా ప్రవర్తించడం గొప్ప.

కదండీ?

(అయిపోయింది)

తాజాకలం : ఇప్పుడే మా అమ్మనించి లెటర్ వచ్చింది. 'కృష్ణా. రాద్దాం అనుకుంటూనే నిర్లక్ష్యం చేస్తూ వచ్చాను. భారత పౌరురాలిగా నా విముక్తధర్మాన్ని నిర్వర్తించడానికి నేను విజయవాడలోని భారతదేశ జనాభాలెక్కల కార్యాలయానికి వెళ్ళాను, నీ ఫోన్ రాగానే. జరిగిన పొరబాటు అక్కడి ఆఫీసర్‌కి చెప్పి నా పేరు కొట్టేయించాను. లేకపోతే, భారత జనాభాలో ఓ సంఖ్య, మహిళా జనాభాలో ఓ సంఖ్య,

జనసాంద్రతలో ఓ సంఖ్య అదనంగా పెరిగి వుండేది. మొత్తం భారత జనాభా 84,39,30,861 బదులు 843,930862 అయివుండేది.

మీ అమ్మ
మల్లాది శారదాంబ

ఓ! చచ్చింది గొర్రె!!

# ముద్దుల్ కావలెనా...మురిపాల్ కావలెనా?

**నా** జీవితంలో మొదటిసారిగా ఓ అమ్మాయిని ముద్దు పెట్టుకున్నాను. అదేరోజు నా మొదటి సిగరెట్ కూడా కాల్చాను.... అప్పటినించి నాకు మళ్ళీ సిగరెట్ తాగే టైమే లేకపోయింది.

— అర్టురీటీస్ కార్ని

*　　　*　　　*

నా లెక్కల టీచర్‌కి నేనంటే ఎంతో ప్రేమ. నా ప్రతి లెక్కపక్కన ముద్దులు (x) పెడుతూంటుంది.

— టోనికానరి

నువ్వు నా ముద్దులు మర్చిపోతే, నేను నీ పేరు మర్చిపోయాను.

— ఏ. సి. స్విస్‌బర్న్

*　　　*　　　*

ఓ ముద్దుకోసం ఓ యువకుడు తన మొత్తం హృదయాన్నికాక తన యావత్ ఆనందాన్ని కూడా వృధా చేసుకోవచ్చు, ఆ పెదవులు పర్‌ఫెక్ట్‌గా వుంటే.

— ఆల్‌ఫ్రెడ్ టెన్నిసన్

*　　　*　　　*